క్లుప్తంగా

ఆలయ నిర్మాణానికి శ్రీకారం



కనక దుర్గమ్మ ఆలయ ద్వారం ప్రతిష్ట మహోత్సవంలో పాల్గొన్న భక్తులు

సింధియా: జీవీఎంసీ 63వ వార్డు పరిధి క్రాంతి నగర్‌లో నూతనంగా నిర్మిస్తున్న కనకదుర్గమ్మ తల్లి ఆలయ ముఖ ద్వారం ప్రతిష్ట మహోత్సవాన్ని ఆదివారం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆలయ నిర్వహణ కమిటీ ఆధ్వర్యంలో అమ్మ వారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం అర్చకుడు శ్రీనివాస్ ఆలయ ద్వారం ప్రతిష్ట వైభవంగా నిర్వహించారు. త్వరలోనే ఆలయ నిర్మాణం పూర్తి చేస్తామని కమిటీ నిర్వాహకులు తెలిపారు.

కాలనీ అభివృద్ధిపై చర్చ



సమావేశంలో పాల్గొన్న కాలనీ వాసులు

మల్కాపురం: జీవీఎంసీ 60వ వార్డు గుల్లల పాలెం వద్ద గల ఎంఐజీకాలనీ వాసుల సర్వసభ్య సమావేశం ఆదివారం జరిగింది. కాలనీ అభివృద్ధి, సభ్యుల సంక్షేమంపై చర్చించారు. త్వరలో సంఘం నూతన పాలక మండలి ఎన్నిక నిర్వహించనున్నారు.

పలువురికి సీఎం రిలీఫ్ ఫండ్ అందజేత



బాధితులకు సీఎం రిలీఫ్ పండ్ అందజేస్తున్న ఎమ్మెల్యే గణబాబు

గోపాలపట్నం: సీఎం రిలీఫ్ ఫండ్‌ను పలువురికి ప్రభుత్వ విప్ గణబాబు ఆదివారం అందజేశారు. పలు వార్డులకు చెందిన ఆరుగురికి ప్రొసీడింగ్ అందించారు. సుమారు రూ.9.5లక్షలు అందించారు. 91వ వార్డు నాయుడు క్వార్టర్స్‌కు చెందిన శ్రీకాంత్‌కు, లక్ష్మీనగర్‌కు చెందిన గరికిన లింగేశ్వర రావు, ఇందిరానగర్‌కు చెందిన పూర్ణ గాయత్రి, కోరాడ ఆనంద్‌కుమార్, చాకలి గెడ్డ ప్రాంతానికి చెందిన కంటి మహంతి విరూప్‌కు సీఎం రిలీఫ్ ఫండ్ అందించారు.

నవదుర్గ అమ్మవారి విగ్రహ ప్రతిష్ట

మల్కాపురం : జీవీఎంసీ 59వ వార్డు హనుమాన్ సంజీవ్‌కాలనీ కొండపై గల నవదుర్గా అమ్మవారి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఆలయ ధర్మకర్త మాత శ్రీను ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ప్రభుత్వ విప్ పి.గణబాబు పాల్గొన్నారు. కార్యక్రమంలో హనుమాన్ సంజీవ్‌కాలనీ గ్రామస్తులు పాల్గొన్నారు.

రోడ్లు అధ్వానం.. ప్రయాణం నరకం

- మట్టి రోడ్డు ..ఆపై గుంతలు
- అవస్థలు పడుతున్న వాహనదారులు
- 58వ వార్డులో రహదారుల దుస్థితి



రాళ్లు తేలి అధ్వానంగా రహదారి



గుంతలతో సేవా మార్గం

మల్కాపురం : విశాఖ..స్మార్ట్ సిటీ..ఇది నాణానికి ఒక వైపు మాత్రమే..మరోవైపు పరిశీలిస్తే..నగరంలో చాలా రహదారులు అస్తవ్యస్తంగా ఉన్నాయి. జీవీఎంసీ అధికారుల లోపాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ప్రభుత్వ నిర్లక్ష్యం అడుగడుగునా దర్శనమిస్తోంది. ప్రధాన రహదారులపై దృష్టి పెడుతున్న ప్రభుత్వం..సర్వీసు రహదారులను గాలికి వదిలేసింది. ఫలితంగా ఏళ్లు గడుస్తున్నా ఆ రహదారుల్లో మార్పు రావడం లేదు. వాహనదారులు, పాదచారులు గాయపడుతున్నా అటు అధికారులు, ఇటు నాయకులు పట్టించుకున్న దాఖలాలు లేవు.

జీవీఎంసీ 58వ వార్డును పరిశీలిస్తే గ్రేటర్ రహదారుల సొగసు ఏపాటిదో స్పష్టంగా కనిపిస్తుంది. కోరమాండల్ రక్షణ గోడను అనుకుని శ్రీనివాస్‌నగర్ మీదుగ కోడిపందాలదిబ్బ ప్రాంతానికి వెళ్లే మార్గం ఉంది. ఇది 30 ఏళ్లుగా మట్టి మార్గంగా ఉంది. ప్రభుత్వాలు మారుతున్నా ఈ రహదారికి మాత్రం మోక్షం లభించడం లేదు. కోడిపందాలదిబ్బ, శ్రీనివాసనగర్, శ్రీహరిపురం తదితర ప్రాంతాల నుంచి వందల సంఖ్యలో జనం రాకపోకలు సాగించే ప్రధాన రహదారి ఇది. అలాగే వందల సంఖ్యలో వాహనదారులు ప్రయాణిస్తుంటారు. రహదారి మొత్తం రాళ్లు, గుంతలతో నడవడానికి వీల్లేకుండా మారింది. మట్టి మార్గానికి మోక్షం కల్పించాలని 30 ఎళ్ల నుంచి కాలనీ వాసులతో పాటు, వాహనదారులు అధికారులు, నాయకులకు మొరపెట్టుకుంటూనే ఉన్నారు. ఏళ్లు గడుస్తున్నా ఈ రహదారులకు మాత్రం మోక్షం కలగడం లేదు.

వాహనాలు అదుపు తప్పుతున్నాయి



రాళ్లు తేలి ఉన్న ఈ మార్గంలో ద్విచక్ర వాహనాలు నడపలేని పరిస్థితి. గత వారం కోడి పందాల దిబ్బ ప్రాంతానికి ద్విచక్ర వాహనంతో వెళ్తే అదుపు తప్పి పడిపోయా..కుడి పాదం వద్ద గాయమైంది. అధికారులు స్పందించి రహదారికి మరమ్మతులు చేయాలి.

–పెద్దాడ వెంకటరమణ, వాహనదారుడు

రాకపోకలకు ఇబ్బందిగా ఉంది



రాత్రి సమయంలో శ్రీనివాస్‌నగర్ మట్టి మార్గంలో వచ్చినప్పుడు వాహనం అదుపుతప్పింది. వాహనాన్ని అదుపుచేయలేకపోయా..భుజానికి గాయమైంది. మట్టి..రహదారిపై రాళ్లు తేలడంతో తరచూ ఇబ్బందులు పడుతున్నాం. ఈ మార్గంలో విద్యుత్ లైట్లు కూడా లేవు. దీంతో చాలా ఇబ్బందికరంగా ఉంది.అధికారులు ఈ సమస్యపై స్పందించాలి.

–సి.నారాయణరావు, శ్రీనివాసనగర్

పార్కులో విద్యుత్ దీపాల ఏర్పాటుకు శ్రీకారం

విశాఖ విద్య: జీవీఎంసీ 90వ వార్డు లక్ష్మీనగర్ ఎఫ్ బ్లాక్ వాసుల సౌకర్యార్థం విద్యుత్ సబ్ స్టేషన్ అనుకొని ఉన్న జీవీఎంసీ పంచతత్వ పార్క్‌లో విద్యుత్ దీపాలు ఏర్పాటు చేసే పనులకు ఆదివారం కార్పొరేటర్ బొమ్మిడి రమణ శంకుస్థాపన చేశారు. పార్కులో విద్యుత్ దీపాలు లేక, ఉదయం, సాయంత్రం వేళల్లో కొంత అసౌకర్యంగా ఉంటుందని సందర్శకులు కార్పొరేటర్ దృష్టికి తీసుకొచ్చారు. సందర్శకులందరికీ ఉపయోగకరంగా ఉండేలా రూ.15.22 లక్షల జీవీఎంసీ నిధులతో విద్యుత్ దీపాలు అమర్చనున్నట్లు రమణ తెలిపారు. కార్యక్రమంలో జీవీఎంసీ విద్యుత్ విభాగం ఏఈ సత్యసిరి, వర్క్ ఇన్‌స్పెక్టర్ సంతోషి, పార్క్ అసోసియేషన్ అధ్యక్షుడు పంచదార్ల శ్రీధర్ పాల్గొన్నారు.



శంకుస్థాపన చేస్తున్న కార్పొరేటర్ రమణ

బాక్సింగ్‌లో బంగారు పతకాలు

మల్కాపురం: జీవీఎంసీ 61వ వార్డు మల్కాపురం, గొల్లవీధి ప్రాంతానికి చెందిన రేష్మా యాదవ్, ప్రవల్లిక యాదవ్‌లు ఈ నెల 5 నుంచి 8వ తేదీ వరకు జరిగిన విశాఖ బాక్సింగ్ టోర్నమెంట్‌లో బంగారు పతాకాలు సాధించారు. విశాఖ జిల్లా బాక్సింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గంగవరం వద్ద ఈ బాక్సింగ్ పోటీలు జరిగాయి. బాలికల విభాగంలో జరిగిన ఈ పోటీలలో రేష్మాయాదవ్, ప్రవల్లికయాదవ్‌లు అద్భుత ప్రతిభ చూపి బంగారు పతకాలను సాధించారు. బంగారు పతకాలు సాధించిన వీరిద్దరూ అక్కచెల్లెళ్లు కావడం గమనార్హం.



బాక్సింగ్‌లో బంగారు పతకాలు సాధించిన రేష్మాయాదవ్, ప్రవల్లిక యాదవ్

ఘనంగా తోటపోలమాంబ పండగ

గోపాలపట్నం: జీవీఎంసీ 91వ వార్డు తోటపోలమాంబ అమ్మవారి పండగ మహోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారికి పసుపు, కుంకుమలతో పూజలు చేశారు. చీరలు, గాజులు సమర్పించుకున్నారు. తోటపోలమాంబ అమ్మవారిని ఎమ్మెల్యే గణబాబు దర్శించుకున్నారు. అమ్మవారి పండగ సందర్భంగా బీఆర్‌టీఎస్ సర్వీస్ రోడ్డులో పరస ఘనంగా నిర్వహించారు. సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.



విశేషాలంకరణలో తోటపోలమాంబ

బోయ, వాల్మీకులను ఎస్టీల్లో చేర్చడానికి వీల్లేదు

ఉక్కునగరం: బోయ, వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చడానికి వీల్లేదని విశాఖ బంజారా వెల్ఫేర్ అసోసియేషన్ హెచ్చరించింది. ఆదివారం ఉక్కునగరం బంజారా కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో అసోసియేషన్ అధ్యక్షుడు ఎం.ఎల్. నాయక్, ప్రధాన కార్యదర్శి భూక్య వేంకటేశ్వర్లు మాట్లాడుతూ ఎస్టీల్లో ఉన్న తెగలకు ఇప్పటికే ఉద్యోగావకాశాలు తగ్గిపోయాయన్నారు. తద్వారా ఎస్టీల్లో నిరుద్యోగ సమస్య పెరిగిపోతోందన్నారు. తద్వారా ఎస్టీలు ఇతర రాష్ట్రాలకు తరలిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ పరిస్థితుల్లో రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో బోయ, వాల్మీకులను ఎస్టీలో కలుపుతూ తీర్మానం చేయడం దుర్మార్గమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆ ప్రతిపాదన విరమించుకోక పోతే పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో వర్కింగ్ ప్రెసిడెంట్ లక్ష్మణ్, రాథోడ్ వస్త్రం, బీకే నాయక్, బీఎంకే నాయక్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రధానకార్యదర్శి వేంకటేశ్వర్లు

కోడి పందాల శిబిరంపై దాడి

పోలీసుల అదుపులో నలుగురు

పరవాడ: తాడి గ్రామంలో నిర్వహిస్తున్న కోడి పందాల స్థావరంపై పరవాడ పోలీసులు ఆదివారం దాడి చేసి నలుగురిని అదుపులోకి తీసుకున్నారు. ముందుగా అందిన సమాచారంతో పరవాడ సీఐ ఆర్.మల్లికార్జునరావు ఆదేశాల మేరకు తాడి గ్రామ సమీపంలో కోడి పందాలు నిర్వహిస్తున్న స్థావరంపై దాడి చేశారు. ఈ దాడిలో సేనాపతి పైడినాయుడు(మడకపాలెం), వీరేసు అప్పారావు(తానాం), వంజర శ్రీనివాస్(లంకెలపాలెం), లాలం అప్పారావు(పరవాడ)లను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి 3 పందెం కోళ్లు, రూ.5,800 నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ బి.కృష్ణారావు తెలిపారు. ఈ దాడిలో ఏఎస్ఐ బీవై నాయుడు, హెచ్‌సీ సాయికుమార్, పీసీ జి.సన్యాసినాయుడు పాల్గొన్నారు.



పోలీసుల అదుపులో పందెం రాయుళ్లు

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే జైలే గతి

పెందుర్తి: శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే జైలుపాలు కావాల్సి వస్తుందని సబ్ ఇన్‌స్పెక్టర్ అసిరితాత రౌడీ షీటర్లను హెచ్చరించారు. పెందుర్తి పోలీస్ స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్లకు సీఐ సతీష్‌కుమార్ ఆదేశాల మేరకు ఆదివారం కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ చెడు ప్రవర్తన వలన తమ కుటుంబాలు సమాజంలో చిన్న చూపునకు గురవడంతోపాటు, ఇబ్బందులు పడాల్సి వస్తుందన్నారు. మంచి నడవడికతో ఉంటే రౌడీషీట్‌లు ఎత్తివేయడానికి ఉన్నతాధికారులు ఆలోచన చేస్తారని పేర్కొన్నారు. ఈ మేరకు వారికి పలు సూచనలు చేశారు.



కౌన్సిలింగ్ ఇస్తున్న ఎస్ఐ అసిరితాత

కృష్ణా కళాశాలలో నేడు జాబ్‌మేళా

మద్దిలపాలెం: డాక్టర్ వి.ఎస్.కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ ఐ.విజయబాబు తెలిపారు. దివీస్ లేబరేటరీస్ లిమిటెడ్‌లో ఉద్యోగ నియామకాల కోసం జరగనున్న ఈ జాబ్ డ్రైవ్ కేవలం పురుషులకు మాత్రమేనని చెప్పారు. ముఖ్యంగా బీఎస్సీ కెమిస్ట్రీ, బీ ఫార్మసీ, బీటెక్ కెమికల్, ఎమ్మెస్సీ ఆర్గానిక్ కెమిస్ట్రీ, ఎంఎస్సీ ఎనలిటికల్ కెమిస్ట్రీ, ఎం.ఫార్మసీ పూర్తి చేసిన విద్యార్థులకు ఒక సువర్ణ అవకాశమన్నారు. ఎంపికైన వారికి ఉచిత వసతి, ఉచిత యూనిఫాం, పీఎఫ్, ఈఎస్ఐ, రాయితీతో కూడిన భోజన సదుపాయం, జీతంతో పాటుగా కల్పించనున్నారని తెలిపారు. కనీస జీతం రూ.18,000, గరిష్ట జీతం రూ. 24 వేలుగా ఉంటుందన్నారు. అర్హులైన విద్యార్థులందరూ ఈ జాబ్‌మేళాలో పాల్గొని ఉద్యోగాలను పొందాలన్నారు.

అద్భుతంగా యామిని కూచిపూడి రంగప్రవేశం

మద్దిలపాలెం: నృత్యకారిణి యామిని కూచిపూడి నృత్యంలో రంగప్రవేశం చేశారు. సిద్ధేంద్ర యోగి కళా నిలయం గురు ఎస్.ఎస్.వి.సత్యభాను వద్ద 15 ఏళ్లుగా రాష్ట్ర సంప్రదాయ నాట్యం కూచిపూడిని అభ్యసిస్తూ, సర్టిఫికేట్ కోర్స్ డిప్లమో కోర్స్ ఇన్ పొట్టి శ్రీరాములు తెలుగు యూనివర్సిటీలో పాసై అనేక ప్రతిష్టాత్మకమైన ప్రదర్శనలు ఇచ్చిన ఆమె ఆదివారం మద్దిలపాలెం కళాభారతి ఆడిటోరియంలో కూచిపూడి నృత్యంతో అలరించారు. ముఖ్య అతిథి చార్టెడ్ అకౌంటెంట్ చంద్రశేఖర్, కళాభారతి కార్యదర్శి డాక్టర్ జి.ఆర్.కె.ప్రసాద్ రాంబాబు, పొట్టి శ్రీరాములు తెలుగు యూనివర్సిటీ వైస్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ చింతా రవి బాలకృష్ణ, కూచిపూడి కళాక్షేత్ర ప్రిన్సిపాల్ గురు హరిరామ్మూర్తిల సమక్షంలో అద్భుతమైన కూచిపూడి నాట్యముద్రికల నడుమ ఆమె కూచిపూడి రంగ ప్రవేశం చేశారు. ఈ సందర్భంగా యామిని చేసిన నాట్యం అతిథులను మంత్ర ముగ్ధులను చేసింది.

అనంతరం ఆమెను ఆశీర్వదించి నాట్య సౌదామిని అవార్డుతో సత్కరించారు. యామిని సిద్ధేంద్ర యోగి కళా నిలయం ఫౌండర్ డైరెక్టర్ ఎస్.ఎస్.వి.సత్యభాను గురుపూజోత్సవం చేశారు. ఈ రంగ ప్రవేశ కార్యక్రమానికి గాత్రం డి.ఎస్.వి.శాస్త్రి, మృదంగం రాజాగోపాల ఆచార్య, వయొలిన్ ఎమ్మెస్ నీలాద్రి, వీణ శశిధర్, ఫ్లూట్ వి.బి.ఎస్.మురళి, మేకప్ ధరణి, దుస్తులు కూర్మారావులు సహకరించారు.

అలరించిన చిడతల భజన పోటీలు



ఆకట్టుకున్న చిడతల భజన

పరవాడ: స్థానిక పైడిమాంబ అమ్మవారి పండగ సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. పండగ తొలి రోజున జిల్లా స్థాయిలో నిర్వహించిన ఆహ్వాన చిడతల పోటీలు అలరించాయి. ఈ పోటీలను తిలకించేందుకు ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చారు. సాంస్కృతిక కార్యక్రమాలను వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సీఈసీ సభ్యుడు పైల శ్రీనివాసరావు, గ్రామ సర్పంచ్ సిరపరపు అప్పలనాయుడు, మాజీ సర్పంచ్ చుక్క రామునాయుడు, ఉప సర్పంచ్ బండారు రామారావు, పెద్దలు రెడ్డి శ్రీనివాసరావు, పైల రామచంద్రరావు, ఆర్.అక్కునాయుడు, పరవాడ సీఐ ఆర్.మల్లికార్జునరావు తిలకించారు.

ఉత్సాహంగా 'సిడ్నీ తెలుగు సీనియర్స్' సమావేశం

విశాఖ విద్య: సిడ్నీ తెలుగు సీనియర్స్ అసోసియేషన్ ఆత్మీయ సమావేశాన్ని 52వ వార్డు మద్రిపాలెం వుడా లేఅవుట్ లలితా డిలైట్ ఫంక్షన్ హాల్లో మండలపు వాసుదేవరావు ఆధ్వర్యంలో రిటైర్డ్ ఎస్.పి. డి.వి.సాయిబాబా అధ్యక్షతన ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రభుత్వ విప్ పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యులు పి.గణబాబు హాజరై మాట్లాడారు. సిడ్నీ తెలుగు సీనియర్స్ అసోసియేషన్ ఆత్మీయ సమావేశాలు ఏర్పాటు చేసుకోవడం అభినందనీయమన్నారు. చాలా అరుదుగా ఇటువంటి అసోసియేషన్లు ఏర్పడతాయనన్నారు.వాలీబాల్ క్రీడాకారుడుగా ఆస్ట్రేలియాలో అంతర్జాతీయ మ్యాచ్ ఆడిన సందర్భాన్ని సీనియర్ సిటిజన్స్‌తో పంచుకున్నారు. అనంతరం హైదరాబాద్‌కు చెందిన పి.ఆర్.విజయ్ కుమార్ ఎంతో శ్రమించి 250 మంది సభ్యులకు సంబంధించి రూపొందించిన అడ్రస్ డైరీని గణబాబు చేతుల మీదుగా ఆవిష్కరించారు. అనంతరం ఈ ఆత్మీయ సమావేశంలో సీనియర్ సిటిజన్స్ తమ అనుభవాలను పంచుకున్నారు. సమావేశానికి కీలక పాత్ర పోషించిన వాసుదేవ రావును ఈ సందర్భంగా అభినందించారు. కార్యక్రమంలో బి. మల్లికార్జునరావు, మస్తాన్ రావు, జె.సుధాకర్, జి.మురళీమోహన్, ఎ. శ్రీరాములు, ఆర్.అప్పారావు, రామకోటేశ్వరరావు, నేతి శ్రీనివాసరావు, రాధాకృష్ణ (చెన్నై), టి.బి. రాజేంద్రప్రసాద్, ఉపేంద్రతోపాటు అసోసియేషన్ సభ్యులు పలువురు పాల్గొన్నారు.



సమావేశమైన ప్రతినిధులు

స్వర్ణ పతకాలు సాధించిన క్రీడాకారులకు అభినందనలు

సింధియా: ఈ నెల 5,6,7 తేదీల్లో కృష్ణా జిల్లా గన్నవరంలో నిర్వహించిన జిల్లా స్థాయి బాక్సింగ్ పోటీల్లో జై భీమ్ బాక్సింగ్ క్లబ్‌లో శిక్షణ పొందిన క్రీడాకారులు బంగారుపతకాలు సాధించారు. ఆదివారం నిర్వహించిన ఓ ప్రత్యేక కార్యక్రమంలో క్రీడాకారులను పలువురు అభినందించారు. జీవీఎంసీ 40వ వార్డుకు చెందిన క్రీడాకారులు జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీల్లో గెలుపొంది పతకాలు సాధిస్తున్నారని, వారంతా తన శిష్యులు కావడం గర్వకారణంగా ఉందని జై భీమ్ బాక్సింగ్ క్లబ్ కోచ్ గుర్రాల రామారావు ఆనందం వ్యక్తం చేశాడు. అండర్ వెయిట్ 44,46 కేజీల జూనియర్ మహిళా విభాగంలో ధనశ్రీ, 65, 70 కేజీల విభాగంలో రేష్మా, ప్రవల్లిక బంగారు పతకాలు సాధించినట్లు కోచ్ రామారావు తెలిపారు.



స్వర్ణ పతకాలు సాధించిన క్రీడాకారులను అభినందిస్తున్న క్లబ్ సభ్యులు

మూత్రపిండాల సమస్యలపై అవగాహన సదస్సు

కంచరపాలెం: ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లో త్రీస్టార్ వాకర్స్ క్లబ్‌లో అపోలో, కేర్ హాస్పిటల్స్ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం మూత్ర పిండాల సమస్యలపై అవగాహన సదస్సు, ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. క్లబ్ గౌరవ అధ్యక్షుడు పెతకంశెట్టి సుకుమార్ వైద్య శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. వాకర్ల కుటుంబ సభ్యుల ఆరోగ్యానికి పలు సేవలు అందించడం అభినందనీయమన్నారు. నెఫ్రాలజిస్ట్ డాక్టర్ వేణుగోపాల్ మాట్లాడుతూ మూత్ర పిండాల సమస్యలు, పరిరక్షణ కోసం అప్రమత్తంగా ఉండాలన్నారు. డాక్టర్ నరసింహారెడ్డి, డాక్టర్ సురేష్, డాక్టర్ భార్గవి నేతృత్వంలో సుమారు 250 మందికి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేసినట్లు క్లబ్ కార్యదర్శి కాళ్ల వెంకటప్రసాద్ తెలిపారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షులు జయతి ఉమామహేశ్వరరావు, పాలకవర్గ సభ్యులు జె.రమేష్‌కుమార్, కిషోర్‌కుమార్, ఇమ్మానుయేల్, జాలివాకర్, ఏఎల్ నరసింహారావు, క్లబ్ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



వైద్యులను సత్కరిస్తున్న క్లబ్ సభ్యులు

జాతీయ భద్రతా వారోత్సవాలపై అవగాహన

సింధియా: అనకాపల్లిలో జరిగిన 54వ జాతీయ భద్రతా వారోత్సవాల్లో హిందూస్తాన్ షిప్‌యార్డ్ లిమిటెడ్ ఉద్యోగులు పాల్గొన్నారు. రాష్ట్ర కార్మిక, కర్మాగారాల ప్రధాన కార్యదర్శి వాసంశెట్టి ప్రసాద్, ఫ్యాక్టరీస్ డైరెక్టర్ వాణిప్రసాద్ ముఖ్య అతిథులుగా పాల్గొన్న ఈ కార్యక్రమంలో భద్రతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో షిప్‌యార్డ్ గుర్తింపు యూనియన్ నాయకులు, ఉద్యోగులు, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.



54వ జాతీయ భద్రతా వారోత్సవాల్లో పాల్గొన్న హెచ్ఎస్ఎల్ ఉద్యోగులు

నారీశక్తిని గౌరవించాలి



మహిళాశక్తి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న మహిళలు



సత్కారం పొందిన మహిళా చిరు వ్యాపారులతో నిర్వాహకులు

డాబాగార్డెన్స్: మహారాణిపేటలో గల మహిళా శక్తి ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. సాంప్రదాయ రీతిన నిర్వహించిన కార్యక్రమంలో నారీమణులు ఒకే వేదిక పైకి వచ్చి వారి అభిప్రాయాలు తెలిపారు. గద్రెడ్డి రమాదేవి నేతృత్వంలో నిర్వహించిన కార్యక్రమంలో పెద్ద ఎత్తున మహిళలు పాల్గొన్నారు.

మహిళా చిరు వ్యాపారులకు సత్కారం..

మహారాణిపేట: తోపుడు బండ్ల సంక్షేమ సంఘం, రూపాకుల విశాలక్షి చారిటబుల్ ట్రస్టు నిర్వహణలో ఆదివారం మహారాణిపేటలోని న్యూ మోడల్ హాకర్ జోన్‌లో మహిళా దినోత్సవం సందర్భంగా మహిళా చిరు వ్యాపారులను సత్కరించారు. రాజీవ్ గాంధీ మానవ సేవ జాతీయ అవార్డు గ్రహీత రూపాకుల రవికుమార్, చిరు వ్యాపారులు దాకమర్రి బాలాజీ, జి.మనీశ్వరరావు, డి.సింహాచలం, చిన్న, గురునాథం, డి.సంధ్యారాణి, ఒ.భాగ్యలక్ష్మి, డి.కనకదుర్గమ్మ, జి.నాగమణి, కె.వరలక్ష్మి, జె.అరుణమ్మ, లక్ష్మి, బి. దేవుడమ్మ తదితరులు పాల్గొన్నారు.

రహదారి పైనే వ్యాపారంతో ఇబ్బందులు

జగదాంబ: జీవీఎంసీ 35వ వార్డులోని చేపల మార్కెట్ ఇబ్బందులకు గురి చేస్తోందని ప్రసాద్‌గార్డెన్స్ స్థానికులు, స్క్రాప్ వ్యాపారులు వాపోతున్నారు. ముఖ్యంగా ఆదివారం రోడ్డుపై కాలు పెట్టలేని పరిస్థితి ఏర్పడుతుందని ఆవేదన చెందుతున్నారు. ఇక్కడి ఇందిరా మున్సిపల్ స్టేడియం ప్రహరీకి ఆనుకుని రహదారి పైనే చేపల విక్రయాలు జరుగుతున్నాయి. తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల నుంచి పెద్ద ఎత్తున వ్యాపారులు వచ్చి ఆది, మంగళ, శుక్రవారాల్లో వ్యాపారాలు చేస్తుంటారు. దీంతో చేపల నీళ్లు, వ్యర్థాలు చుట్టుపక్కల పేరుకుపోయి దుర్వాసన అలుముకుంటుంది. స్థానికుల ఇళ్లు, ఇక్కడి స్క్రాప్ వ్యాపారుల దుకాణాల్లోకి ఇది చేరి దుర్గంధభరితంగా మారుతోంది. గతంలో పలు మార్లు జీవీఎంసీ అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ తాత్కాలిక చర్యలు తీసుకోవడవంతో పరిస్థితి మొదటికి వచ్చిందని వారు వాపోతున్నారు.



రహదారిపై చేపల విక్రయం